# మాయనిమణి

## శ్రీ సరిపల్లి నరసింగరావుగారు

అర్ధరాత్రి సమయం. ఎక్కడా జనసంచారంలేదు ఆతోడ్డున. పొగమంచు దట్టంగా వ్యాపించడంవల్ల దారికూడ కనబడలేదు. వెండితొడుగులాంటి వెన్నెల తెరకల్లోంచి, బ్రహ్మరాక్షసుల్లాంటి వృక్షచ్ఛాయల్లోంచి, కారు "బర్రు"మని అతి వేగంగా పోతున్నాది.

దెయ్యాలు దేవులాడే పీరుసాయిబు బంగాళా సమీపించేసరికి, "దబ్బు"మని ఏదో చప్పుడయింది. ఆమె సహజభీరువు కాదుగాని—ఆసమయంలో, ఆ స్థలంలో, అలాంటి చప్పుడువింటే ఏలాంటి గుండె నిబ్బరంకలవాళ్లకేనా–కొంచెం జడుపు కలగకమానదు. అసీగాక ఆ బంగళా వూరుచివరవుంది. అందులో దెయ్యాలు రాత్రివేళ స్వేచ్ఛావిహారం చేస్తాయని వూళ్లో పుకారు. కాని—ఆమెకు దెయ్యాలంటే నమ్మకంలేదు; భయం అంతకన్నా లేదు. ఆవేళలాగే యింతకముందు అనేకసార్లు సినీమా రెండోఆట అయిపోయాక, ఆదారంటే కారులో వంటరిగా పోయింది. అయితే—ఆ చప్పుడుమాత్రం ఆమె హృదయంలో కొంత ఆందోళన కలగజేసింది. మరో రెండు మూడు గజాలు పోయేసరికి, రోడ్డువారని ఎవరో మనిషి పడివున్నట్టు గోచరించింది. ఈ దృశ్యం హృదయాందోళనను మరింత రెచ్చగొట్టింది. "వాళ్లతో మొదటి ఆటకేనా వెళ్లేనుకాను; లేకపోతే రేపు మొదటి ఆటకేనా వెళితే బాగుండిపోను" అనుకుంది. ఆమెకు తెలియకుండానే, కారు ఆగిపోయింది. మరుక్షణంలోనే—ఆమెలో మామూలు ధైర్యోత్సాహాలు విజృంభించాయి. లేకపోతే కారుదిగి, రోడ్డువార పడివున్న మనిషిదగ్గరకు వెళ్లగలదా? మొదట "తాగుబోతుగాబోలు—వంటిమీద స్మారకంతప్పి, పడిపోయా"డనుకుంది. తీరా దగ్గరకువెళ్లి, నోరు వాసన చూస్తే, అట్లాటి చిహ్నాలు మచ్చుకేనా కనబడలేదు. టార్చిలైటు ఫోకస్ చేసింది ఆ మనిషి మొహం మీదికి. ముప్ఫయేళ్ల లోపునుంటాయి. మీసాలు, గడ్డాలు బాగా మాసిపోవడంచేత, మొహం పోలిక బాగా దొరకలేదు. జబ్బుపడటంవల్లనో, తిండి లేకపోవడంవల్లనో దవడలు, కళ్లు లోతుకు పోయాయి. తైల సంస్కారంలేని నొక్కు నొక్కుల క్రాపు, విశాల ఫాలభాగం, మొహంతీరు, శరీరచ్ఛాయను బట్టిచూస్తే — సహజసౌందర్యవంతుడేమో అనిపిస్తున్నాది. బాగా మాసిపోయి, అక్కడక్కడ చిరుగులున్న ఫ్యాంటు షర్టును బట్టిచూస్తే పట్టి పల్లెటూరు బచ్చాకాడని గ్రహించవచ్చును. జుబ్బాజేబులోంచి–మనీపర్సుగాబోలు–సహం బైటకువచ్చేసింది. మెల్లిగా ఆ మనీపర్సుతీసి విప్పింది. విప్పగనే "ఎస్. మురళీధరరావు, బి.ఏ," అని, పర్సుకు అతికివున్న సెలులోయడ్డుపేపరు వెనక్కాతల, ఓ చిన్న కార్డుమీద వ్రాసివుంది. ఆ చిరునామా ఆమె అన్వేషణోత్సాహాన్ని, పెంపొందింప జేసింది. పర్సు దులిపింది. చిల్లిగవ్వేనా రాలలేదు కాని—"టక్"మని ఓ చిన్న అట్టముక్క నేలరాలింది. తీసిచూసింది. అదొక ఫోటో. పన్నెండేళ్ల అమ్మాయిది. నిదానించి చూసింది. ఎవరిది? ఆఫోటో—అలా చూస్తూవుంటే, ఆమె హృచ్చలనం ఆగిపోనారంభించింది. ముఖం జేవురించింది. పెదవులు చలించాయి. అంత చలిలోను, ఆమె ఫాలభాగాన్ని స్వేదబిందువులు, మంచి ముత్యాల్లా మెరసిపోతున్నాయి. చెవుల్లోంచి వేడి గాడ్పులు కొడుతున్నాయి. దీర్ఘమైన వెచ్చటి నిట్టూర్పుతో ఆస్థితి అంతరించింది. ఫోటో జాకెట్టు జేబులో వుంచుకుంది. మనీపర్సు అతని జేబులో వుంచేసింది.

అనాలోచితమైన, అద్భుత సంఘటన! అతని

కనురెప్పలు పైకెత్తింది. "ఊఁ"...మూల్గు. మెల్లిగా నోరువిప్పి, నాలుక చలింపజేశాడు. ఆమె గ్రహించింది. కారులోవున్న ఫ్లాస్కు తీసుకొచ్చింది. ఆ ధూళిధూసరమైన రోడ్డుమీదే, తనూ కూర్చుని, అతని శిరస్సు తొడపై పెట్టుకుంది. ఫ్లాస్కులోని వేడిటీ, మూతలో అమర్చబడిన కప్పులోపోసి, అతని నోరు విప్పి, కొంచెము కొంచెముగా పోసింది. అతనూ—గుటకలు వేస్తూ, ఆప్యాయంగా తాగేడు. అలా రెండు కప్పులు పట్టింది. వేడివేడి టీవల్ల నుదురుమీద కొంచెము చెమటపట్టింది. చేతిరుమాలుతో ముఖమంతా శుభ్రంగా తుడిచి, పైటచెరగుతో విసిరింది. అటుయిటూ కదిలాడు. వంటిమీద స్పృహ వస్తున్నట్టుంది "ఎ-వ-రు?" అన్నాడు వణుకుతున్న పెదవులతో, అతి నీరసమైన కంఠస్వరముతో. ఏమని జవాబు చెప్పాలో తోచలేదు. "నే-ను" అంది చివరకు. "అం-టే?" అన్నాడు. కళ్లుతెరచి. చాలా చిక్కుప్రశ్నే. అతను తిరిగి కళ్లుమూశాడు. కాని—ఎందుకు జవాబు చెప్పడం? చేతినున్న రిష్టువాచీ చూస్తే ఒంటిగంటన్నర అయింది. "మరికొంచం టీ తాగుతారా?" అంది. "ఊఁ" అని నోరు విప్పాడు. మరోకప్పు టీ పట్టింది. "లేచి, కారులో కూచోగలరా?" అంది ఫ్లాస్కు మూతవేస్తూ. "ఊఁ" అని చేతుల ఆసరామీద లేవబోయాడు. కాని—పడిపోతాడేమో అని, అతని నడుముకింద చెయ్యివేసి, కూచోబెట్టింది. కళ్లు తెరచి 'ఎక్క—డికి' అన్నాడు. "మాయింటికి" అంది తడుముకోకుండా. "ఎందుకు" అని మళ్లా ప్రశ్నించాడు. "తరవాత చెపుతా,—నడవగలరా?" అంది. "ఊఁ..." అని నిలబడపోతూవుంటే, అతని భుజాలుమీద చేతులువేసి, కారువరకు నడిపించి, బ్యాక్‌సీటు తలుపుతీసి, మెల్లిగా కారులో పడుకోబెట్టింది. ఆమె హృదయం, అప్పుడు చులకనబడింది. కారు "ఘర్రు" మని, వాయువేగ మనోవేగాలతో, మరోరెండు నిమషాలకి భవనం చేరింది. ఆమె ధైర్య స్థైర్యములుగల విద్యావంతురాలు గనుక, అన్వేషణోత్సాహము వుండవచ్చును. విశ్వమానవ ప్రేమతో, అతని కుపచారములు చేయవచ్చును. కాని—ఫోటో—సంగతి?

౨

రెండు మూడు రోజులుపోయాక డాక్టరు అతని జ్వరం—"న్యుమోనియా"—అని తేల్చాడు. ఆమె రాత్రింబగళ్లు అతనికి స్వయముగా వుపచారాలు చేస్తున్నాది. అతనితోపాటు ఆమెకుగూడా నిద్రాహారాలు సమంగాలేవు.

భవనంలోని బాలికలు, వుపాధ్యాయినులు యిదంతా చూసి, చాలా ఆశ్చర్యపోయారు. మగ ఈగనైన భవనంలోకి రానివ్వని—పట్టుదలమనిషి—ఎవరో యువకునికి, అహోరాత్రాలు, స్వయముగా సేవ చేస్తున్నాదంటే, ఎవరికేనా ఆశ్చర్యం కలుగుతుంది. భవనకార్య నిర్వహణమంతా మరో వుపాధ్యాయినికి అప్పజెప్పింది. అతను ఆమె స్నేహితుడా? బంధువుడా? ఎప్పుడు వచ్చాడు? ఎప్పుడు జ్వరం అతన్ని ఆవేశించింది? మొదలైన ప్రశ్నలు భవనములోని అందరి మనస్సులు కలవరపెడుతున్నాయి. కాని—వాటికి జవాబు ఎవరు చెప్పగలరు? ఎవ్వరికీ ఆమెను సమీపించి, ప్రశ్నించగల ధైర్యంలేదు.

ఆవేళ రాత్రి నూటమూడు డిగ్రీల జ్వరం వుందని, కొంచెం జాగ్రత్తగా వుండమనిచెప్పి, ఆరు మోతాదులిచ్చి, రెండేసి గంటలకు ఒక్కొక్క మోతాదు యిమ్మన్నాడు డాక్టరు. ఒక్కనిముషం కన్నుమయ్యకుండా, ఏమరకుండా అతిజాగ్రత్తగా వున్నాది. ఆ రాత్రల్లా అతను పలవరింతలే.

"ఊఁ...అబ్బా...వెధవ బి. య్యే—ఏమో:—మన ఫ్యూచరు ఎలాగుందో—అబ్బే—లాభంలేదు—పాస్టుఒకటి మహాబాగావుండి యేడిసింది—యింక ఫ్యూచరు బాగుంటుంది—ఇంతకీ తండ్రి—కాదు—

పరమ పాపాత్ముడు;—సర్వనాశనం చేశాడు;—ఆ సానిముండ ఎక్కడ దొరికిందో?—గీరిసిన ఆవకాయ డొక్కులాగ—చప్పి దవడలు ఆదీను;—అమ్మవుంటే—నోచుకోందే;—అది వున్నన్నాళ్లు వెధవ పీనారత్వంవోడీ వాడు;-వాళ్లు వెయ్యి రూపాయిలు కట్నం బాకీటు;-అవీ యిచ్చేస్తానన్నారు మామగారు—ఆయనకేమిటి?—పెద్ద డిస్ట్రిక్టు మునసబు—శారద ఒక్కర్తే ఆయను—ఎంత చక్కటి పిల్ల—క్వీన్ ఆఫ్ బ్యూటీ—చదువులోనో?—పన్నెండేళ్లకి ధర్డుఫారము—ఆఫిడిలు వాయిస్తూవుంటే—వెరీస్వీట్ మ్యూజిక్—కోకిల స్వరం—హాయి—హాయి—శారదా! శారదా!—" అని చేతులు రెండు ముందుకు చాపి, మంచం మీంచి లేచిపోతున్నాడు. ఆమె అబల. అయినప్పటికీ తన శక్తినంతా వుపయోగించి, అతన్ని తిరిగి మంచంమీద బలవంతాన్ని పడుకోబెట్టింది. చంకలో థర్మామీటరు పెట్టి, టెంపరేచరు చూసింది. 103.5 జ్వరం హెచ్చుతున్నాది గాని తగ్గలేదు. టంగు టంగుమని గడియారం పన్నెండు కొట్టింది. మూడో మోతాదు పట్టింది. జ్వరం తీవ్రంగావుంది. విషమిస్తుందనో, స్త్రీ సహజమైన జాలిచేతనో, రెండు కన్నీటి బిందువులు అతని వక్షముపై రాల్చింది. ఓ అరగంట నిశ్శబ్దం. మళ్లా మొదలు పలవరింతలు:

"చచ్చి కాలానికి—తాగుడుకూడా మర్చింది—వెధవముండ ఎన్ని దుర్గుణాలు లేకపోతే—అంత ఆస్తి కర్పూరంలాగ—యిట్టే హరించిపోతుందా?—అమ్మని ఎంత ఏడిపించాడు?—ఓ చిల్లిగవ్వైనా చేతికిచ్చివాడా?—అదిపోయింది—దాంతోనే లక్ష్మి కూడా వెళ్లింది. దాని వుసురు తగిలే—చచ్చి కాలానికి పురుగులుకూడా పట్టాయి.—అప్పుకి ఆస్తికి సరి—ఓ పదిరూపాయిల వుద్యోగం; అబ్బే—ఎక్కడా పుట్టందే నోవేకన్సీ—మళ్లా కాంగ్రెసు గవర్నమెంటంట అన్ఎంప్లాయిమెంటు ప్రోబ్లము సాల్వ్ చెయ్యకపోతే-ఏ గవర్నమెంటుకేనా డవున్ ఫాల్ తప్పదు—అది సాల్వ్ అయేవరకు—ఈసోషలిష్టులబాధ—కమ్యూనిష్టుల బాధతప్పదు—తెలివైన ప్రీమియరు అయితే—ముందు యువకుల్ని శాటిస్ఫై చేస్తాడు—అబ్బ! ఎన్నివూళ్లు తిరిగాను-కాళ్లు అరిగిపోయాయి-ఎన్నిచోట్ల "నో" అనిపించుకుని శరీరం చచ్చిపోయింది! దుర్మార్గుడు మామగారింటికి వెళ్లనిచ్చాడా? మామగారు ఎంత మంచివారు! మొదటి పండుక్కి వెళితే ఎంతమర్యాద! ఎంతప్రేమ! అత్తగారికి ఎంతదయ! ఎంత అభిమానం! చనిపోయిన తల్లిని మరపించేది-వాళ్లిద్దరూ యిప్పుడున్నారా? ఎక్కడున్నారో? మామగారికి ఏవూరు ట్రాన్స్ఫరు అయిందో? శారద-నా ముద్దులశారద-ఆహా!...... మామగారికి తనకి కట్నంలో మాట పట్టుదల శారదని ఏలుకోవద్దన్నాడు. నేను చెడ్డాను. అయినా నా తెలివితేటలు, నా చదువు, నా ఒరిజినాలిటీ ఎక్కడ కాలిపోయాయి. శారదతో వుంటే ఈపాటికి ఇల్లరికపు అల్లుణ్ని—మామగారు వుద్యోగం వేయిద్దురు. అన్నిటికీ చెడ్డాను. మూడురోజులు కటికీ వుపవాసాలు. కాఫీ చుక్కైనా యిచ్చినవాడున్నాడా? అందులో ఈవూరు మరీ గొడ్డుపోయింది. అది దెయ్యాలకొంపట. ఏదెయ్యమేనా—యీబాధలే వుండవు. ఆమె ఎవరో దేవత, నోట్లో టీ పోసింది. ప్రాణాలు నిలపెట్టింది. కారులో ఎక్కడికి తీసుకుపోయిందో? ఊ—ఊస్స్-" అలిసిపోయి మరి మాట్లాడలేకపోయాడు. గడియారం రెండుకొట్టింది. నాలుగో మోతాదు పట్టింది. టెంపరేచరు నూటరెండు వుంది. కొంచెం నిద్రకూడా పట్టినట్టుంది. అతని మంచంమీద కూచుని గంటగంట టెంపరేచరు చూస్తూ రెండేసి గంటలకి మందుపడుతూ మధ్య మధ్యని కాళ్లు చేతులూ వెచ్చగావున్నాయో లేవో చూస్తూ అతని ముఖకళలను గమనిస్తూ కంటికీ మంటికీ ఏకధారగా ఒకటే ఏడుపు. ఎందుకోగాని అతని

మొహం చూస్తూవుంటే సాగరతరంగాల్లాగ పొరలి పొరలి మరీ వచ్చేస్తున్నాది ఏడుపు.

కాళరాత్రి !!!

3

"అయితే యింకా మీరు భవనం పూర్తిగా చూడలేదన్నమాట" అంది.

"లేదు" అన్నాడు.

"వస్తారా–చూద్దాం" అని యిద్దరూ బయలుదేరేరు.

ఆ సంస్థ స్వయంపోషకసిద్ధాంతాలమీద నడుపబడుతూవుంది. అనాథలకు తోడ్పడి అన్నివిధాలా ఆదర్శగృహిణులను తయారుచేయడమే ఆసంస్థ వుద్దేశం. అయినా ఇష్టమువున్నవారు ఏశాఖలోనైనా, ఏ విజ్ఞానశాస్త్రములోనైనా ప్రావీణ్యము సంపాదించుకోడానికి కావలసిన యేర్పాట్లూ శిక్షణా వున్నాయి.

"అయితే నెలకి మొత్తంమీద ఎంత ఖర్చవుతుందండి" అన్నాడు.

"సాధ్యమైనంతమట్టుకు అన్నిపనులు మేమే చేసుకోవడమువల్ల అయిదువందలు అవుతున్నాయి. లేకపోతే మరో అయిదువందలు సులాగ్గా అవుతాయి" అన్నాది.

"ఈడబ్బు ఎలావస్తుందండి?" అన్నాడు.

"అయిదు సంవత్సరాల క్రిందట మూడువేల రూపాయిల పెట్టుబడితో స్థాపించా. నావలె అన్యాయముగా, అకారణముగా భర్తవల్ల విడువబడ్డ స్త్రీలకే యిందులో ప్రవేశం. తరవాత ప్రజల కోరికపైని వితంతువుల్ని, కన్యకలనుగూడా చేర్చుకుంటున్నాము. చిన్నా పెద్దా కలిసి మూడువందల మంది వున్నారు ప్రస్తుతం. అందులో నూటపధ్నాలుగురు బీదవిద్యార్థినులకు యిచ్చటే వసతి ఏర్పరిచాము. నూటడెబ్భైఅయిదుగురు యిళ్లనుంచి వస్తారు. అందులో ధనవంతులదగ్గర చెప్పవలసిన చదువును బట్టి డబ్బు వసూలుచేస్తాము. పదకొండుమంది విద్యార్థినులు హాస్టలులోవుండి నెలకు యిరవైరూపాయిలు చెల్లిస్తున్నారు. పైబాపతులవల్ల వచ్చే సొమ్ము భవనపు నెలవారి ఖర్చులకు సరిపోతుంది. దీనికి పోషకులు, రాజపోషకులు, మహారాజపోషకులవల్ల ఏటా రెండు మూడు వేలు వసూలవుతుంది. అందులో వెయ్యి రూపాయిలు యేడాదికి భవనపు మూలధనం క్రింద యింపీరియల్ బ్యాంకులో వేస్తున్నాము. మిగతా సొమ్ము, వార్షికోత్సవములు, నాటకములు, ఆరోగ్యవారము మొదలైనవాటికి ఖర్చుపెడుతున్నాము. ఇక్కడ చదువుచెప్పే పాతికమంది వుపాధ్యాయినులు అల్పసంతోషులు. వారికిక్కడ వసతి ఏర్పరచాము."

"ఆదర్శభవనం" అన్నాడు చిరునవ్వు నవ్వుతూ.

"..........."

"కాని నాకు ప్రాణదానముచేసిన మీచరిత్ర తెలుసుకొన గోరుచున్నాను" అని ఆమె ముఖకళలను గమనిస్తున్నాడు.

ఆమె తలవంచుకుంది. రెండు వెచ్చటి కన్నీటిబిందువులు అతని పాదాలపైబడి వ్యాపించాయి. ఆశ్చర్యపోయాడు, నొచ్చుకున్నాడు.

"మీ మనస్సు కష్టపెట్టినందుకు క్షమించ—" అనబోతూవుంటే,

"ఆ! వద్దు. మీరు పెద్దవారు; నేను చిన్నదాన్ని" అంది అతివినయంగా.

"వయస్సుకు చిన్నవారైనా, బుద్ధికి—"

"మీకంటేనా? మీరు గ్రాడ్యుయేట్లు; నేనో చిన్నస్కూలుఫైనలు—" అని నాలుక కరుచుకుంది.

అతను తెల్లబోయాడు. తన చదువుసంగతి ఆమెకు ఎలా తెలిసింది? అతని అనుమానం గ్రహించి "ఆవేళ రాత్రి మీపర్సువిప్పి అడ్రెసు చూశాను—ఫోటో కూడా తీసినందుకు క్షమించగోరుచున్నాను" అంది రెండు చేతులు జోడించి. అతని మనస్సు చివుక్కుమంది. ప్రాణసమానమైన ఫోటో? ప్రాణదానము చేసిన పడతి? చివరకు తెగించి "ఆఫోటో యిప్పిస్తారా?" అని అతిదీనంగా వేడుకున్నాడు. ఆమెకు అతని మొహం ఆసమయంలో చూస్తే జాలివేసింది. నవనీతమువంటి స్త్రీహృదయము ఎంతటిలో కరుగుతుంది! యింక అట్టే దాచడం బాగుండదని కిటికీదగ్గరకు వెళ్లి జాకెట్టుజేబులోంచి ఫోటోతీసి చేత్తో పట్టుకుని అతనిదగ్గరకు వచ్చింది. "ఈఫోటో—నాదిలాగున్నాదే?" అంది క్రీగంట అతని భావాలను గమనిస్తూ.

"మీదా?!—అసం-భ-వం-" అన్నాడు అక్షరం అక్షరం విరుస్తూ నొక్కుతూ.

"నా గదిలోకి ఒకసారివస్తారా?" అన్నాది. "ఆ ఫోటో తనది కాకపోతే యింకెవరిదన్న" ధైర్యంతో ముందుకు దారితీస్తూ. ఇద్దరు ఆమెగదిలోకి వెళ్లేరు.

ఆ గోడనున్న ఫోటోయే చూపిస్తూ, "రెండూ-ఒక్కలాగే-వున్నాయే!" అన్నాడు నోరు వెళ్లబెట్టి. "అయితే-ఆగోడనున్న ఫోటో-ఎవరిదీ?" అన్నాడు యింకా అనుమానంతీరక. "రెండూ-మీపాదదాసీ-అయిన-నావే-అని-తెలుస్తున్నా" అంది అదరుతున్న పెదవులతో, ఎఱ్ఱబడ్డ చెక్కిళ్లతో. "ఎప్పుడు తీయించారు?" అన్నాడు యేమీ ఎరగనట్టు. "ఓహో! నన్ను పరీక్షిస్తున్నారా? మన పెళ్లిముందర తీయించింది. ఓకాపీ మీదగ్గరవుంది. మరొకటి అది" అంది తొణకకుండా బెణకకుండా. గది నాల్గువేపులా పరీక్షించాడు. తూర్పుగోడకు ఆని ఓపీఠముపై తన తాలూకు తైలచిత్రము, దానిదిగువన పుష్పాలు, చిత్రము చుట్టూ రెండు మూడు పూలహారాలు కనిపించాయి. టేబిలుమీద భార్యా కలిసి మధుపర్కములతో నాగవల్లినాడు తీయించుకున్న ఫోటో వుంది. ఇంతలో ఆమె మరోఫోటో గోడనుంచి తీసి అతని చేతికిచ్చింది. అది తన పెండిశుభలేఖ. "శారదా! క్షమించు" అని రెండు చేతులుచాపి ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. తన అవివేకానికి అదే క్షమాపణ. ఓ పావుగంటవరకు సుఖదుఃఖాతిశయములవల్ల యిద్దరూ మాట్లాడలేకపోయారు. ఎంతో బలమైన కారణములు, నిదర్శనములు వుంటేగాని, "నేను నీ భార్యను సుమా" అని హైందవ నారీమణి ఓపురుషునితో వక్కాణించగలదా? శారద ముంగురులు సవరిస్తూ "శారదా! మామగారు?—అత్తగారు?—" అన్నాడు సంకోచిస్తూ. "లేరు—ఈలోకంలో—లేరు." వలవలమని ఒకటే యేడుపు. ఎంత కఠినహృదయుడికైనా కంటనీరు కారకమానదు ఆపరిస్థితులలో. "నాన్నగారుకూడా" అన్నాడు రుద్ధకంఠంతో. "ఆ! మామగారుగూడానా? అయ్యో! ఎంత దురదృష్టవంతులం"......దుఃఖం ఓదార్చిన తరవాత "శారదా! మీ నాన్నగారు నిన్ను స్కూలుఫైనలువరకు చదివించడం చాలా మేలయింది" అన్నాడు సంభాషణలో.

"ఆపాటి చదువు వచ్చుటచేత ఏదో పాతికవేలు యిచ్చుటచేత తమ దయవలన ఈభవనం స్థాపించి కాలం వెళ్లబుచ్చుతున్నాను" అంది వినయసౌశీల్యాదుల కాటపట్టయిన స్త్రీస్వభావంతో.

ఆనందంపట్టలేక శారదను దగ్గరకు తీశాడు మురళీధరుడు.